సాక్షి
ఖమ్మం
గురువారం ▪ 13 ▪ మార్చి ▪ 2025



‘హస్తం’లో మల్లగుల్లాలు !

సీతారామ ప్రాజెక్ట్‌కు ఇందిరాసాగర్ లేదా రాజీవ్‌సాగర్ పేరు పెట్టే అంశాన్ని కాంగ్రెస్ ముఖ్య నేతలు పరిశీలిస్తున్నారని తెలుస్తోంది. 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం సా॥) 6.24

సహర్ (శుక్రవారం ఉ॥) 5.02

వాతావరణం

గరిష్టం / కనిష్టం 40° / 21°

జిల్లాలో గురువారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మాత్రం చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఖాళీ పోస్టుల భర్తీకి 22న పరీక్షలు

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రావు

ఖమ్మంలీగల్: జిల్లా న్యాయ సేవాధికారి సంస్థలో ఖాళీ పోస్టుల భర్తీకి ఈనెల 22న పరీక్షలు నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి కె.వి. చంద్రశేఖర్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశామని, సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. స్టెనో/టైపిస్ట్ పరీక్ష ఉదయం 9 నుంచి ఉదయం 9.45 వరకు, టైపిస్ట్ కం అసిస్టెంట్ పరీక్ష ఉదయం 10.15 గంటల నుంచి ఉదయం 11 వరకు, జూనియర్ అసిస్టెంట్ పరీక్ష మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు, రికార్డు అసిస్టెంట్ పరీక్ష 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు https://khammam.dcourts.gov.in వెబ్ సైట్ ద్వారా హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

31లోగా దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంవన్‌టౌన్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో దశకు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పరిశ్రమల శాఖ జీఎం టి.సీతారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.5 వేలు, 6 వేల చొప్పున చెల్లిస్తామని, 12 నెలల ఇంటర్న్‌షిప్ కాల వ్యవధిలో కనీసం 6 నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు 21 – 24 ఏళ్ల మధ్య వయసు ఉండాలని, వివరాలకు 1800 11 6090 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

‘లిఫ్ట్’ పనుల్లో నాణ్యత లోపించొద్దు

- ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి

రఘునాథపాలెం : లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో నాణ్యత లోపించకుండా తగు జాగ్రత్తలు పాటించాలని జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి అధికారులకు సూచించారు. రఘునాథపాలెం మండలంలో రూ.66 కోట్ల అంచనాతో నిర్మిస్తున్న మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పంప్‌హౌస్, పైపులైన్ నిర్మాణం, మోటార్ల కొనుగోలు, సబ్‌స్టేషన్ నిర్మాణం తదితర పనులపై సమీక్షించి ఇంజనీర్లకు, కాంట్రాక్ట్ సంస్థకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎస్ఈ మంగళపుడి వెంకటేశ్వర్లు, ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ పాల్గొన్నారు.

సబ్‌జైల్‌లో వరంగల్ రేంజ్ డీఐజీ విచారణ



సబ్‌జైల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఐజీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదీ పెంద్ర రమేష్ పరారీ, పట్టుబడిన ఘటన నేపథ్యంలో జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ మాలారపు సంపత్ బుధవారం విచారణ చేపట్టారు. రిమాండ్ ఖైదీ పరారీ ఘటనలో సిబ్బంది నిర్లక్ష్యంపై ఆరా తీశారు. జైలులో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. సబ్‌జైల్ బయట గోడకు ఆనుకొని ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. జైల్ ప్రాంగణమంతా కలియతిరిగి ఉద్యోగులు, ఖైదీలను విచారించారు. ఈ ఘటనపై త్వరలోనే శాఖా పరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. ఆయన వెంట ఉమ్మడి ఖమ్మం జిల్లా సబ్‌జైళ్ల అధికారి జి.వెంకటేశ్వర్లు, సత్తుపల్లి జైల్ సూపరింటెండెంట్ ఎస్.ప్రవీణ్ ఉన్నారు.

కొనసాగుతున్న ఐటీ తనిఖీలు !

ఖమ్మం సహకారనగర్ : శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ఐటీ అధికారులు చేస్తున్న తనిఖీలు నగరంలో బుధవారం సైతం కొనసాగాయి. అడ్మిషన్లు, ఫీజుల వివరాలు, ఆర్థిక లావాదేవీలపై పూర్తి స్థాయిలో వివరాలు సేకరించినట్లు తెలిసింది.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎంల బదిలీ

ఖమ్మంమయూరిసెంటర్ : టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో డిప్యూటీ ఆర్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న జి.ఎస్.పవిత్ర, భవానీ ప్రసాద్‌ను బదిలీ చేస్తూ సంస్థ వైస్ చైర్మన్, ఎండీ సజ్జనార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. భవానీ ప్రసాద్‌ను మహబూబ్‌నగర్‌కు, జి.ఎస్.పవిత్రను షాద్‌నగర్‌కు బదిలీ చేశారు. కాగా, వీరి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి



తేజా@ఖమ్మం

మార్కెట్‌లో పెరిగిన మిర్చి విక్రయాలు

- విదేశీ ఎగుమతులకు అడ్డాగా ఖమ్మం
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న తేజా మిర్చి
- గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిన విక్రయాలు

ఖమ్మంవ్యవసాయం : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి విక్రయాలు గణనీయంగా పెరిగాయి. తెలుగు రాష్ట్రాల్లోని గుంటూరు, వరంగల్, ఖమ్మం మార్కెట్లలో మిర్చి విక్రయం ఎక్కువగా ఉంటుంది. అయితే కాలక్రమంలో ఖమ్మం మార్కెట్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. ఈ ప్రాంతంలో తేజా మిర్చి సాగు అధికంగా ఉండడం, ఈ మిర్చికి విదేశాల్లో డిమాండ్ ఉండడంతో ఎగుమతిదారులు ఈ రకం మిర్చి కొనుగోళ్లకు ఖమ్మం మార్కెట్‌ను ఎంచుకున్నారు. తేజా మిర్చి, మిర్చి ఆయిల్ చైనా, మలేషియా, బంగ్లాదేశ్, సింగపూర్ తదితర దేశాలకు ఎగుమతి అవుతోంది. విదేశీ ఎగుమతులు పెరుగుతుండగా రైతులు ఈ పంట సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

ఇతర జిల్లాల్లోనూ..

రాష్ట్రంలో తేజా మిర్చి సాగు పెరుగుతోంది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 2.50లక్షల ఎకరాల్లో ఈ రకం మిర్చి సాగు చేశారు. గతంలో ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో తేజా మిర్చి సాగు ఉండేది. కానీ ఇప్పుడు ఈ జిల్లాలతో పాటు నల్లగొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, జనగాం, యాదాద్రి భువనగిరి, జోగులాంబ గద్వాల, మహబూబ్‌నగర్, నిర్మల్, ఆదిలాబాద్, నాగర్‌కర్నూలు తదితర జిల్లాల్లోనూ తేజా మిర్చి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఒక్క ఖమ్మం జిల్లాలోనే 60 వేలకు పైగా ఎకరాల్లో మిర్చి సాగు చేయడం గమనార్హం.

పోటెత్తుతున్న మిర్చి..

తేజా రకం మిర్చికి ఖమ్మం మార్కెట్ అడ్డాగా మారడం, విదేశీ ఎగుమతిదారులు ఈ మార్కెట్‌లో కొనుగోళ్లు చేస్తుండడంతో తెలుగు రాష్ట్రాల్లో పంట సాగు చేసిన రైతులు ఇక్కడ విక్రయించేందుకే మొగ్గు చూపుతున్నారు. ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన వ్యాపారులు సైతం ఈ మార్కెట్‌లోనే విక్రయిస్తున్నారు. దీంతో ఖమ్మంలో మిర్చి విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ప్రధానంగా రెండో కోత తర్వాత ఇక్కడ విక్రయాలు మరింతగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 11 వరకు 3.80 లక్షల మిర్చి బస్తాలు అధికంగా విక్రయానికి వచ్చాయి.

జనవరి నుంచి మార్చి 11 వరకు ఖమ్మం మార్కెట్‌కు మిర్చి బస్తాల వివరాలు

నెల	2024	2025
జనవరి	4,32,362	3,81,442
ఫిబ్రవరి	8,57,438	9,61,737
మార్చి	1,81,248	5,10,995
మొత్తం	14,71,048	18,54,174

ఖమ్మం కేంద్రంగా ధర నిర్ణయం..

గతేడాది తేజా రకం మిర్చి క్వింటా రూ. 20 వేల నుంచి రూ. 23వేల వరకు ధర పలికింది. దీంతో వివిధ ప్రాంతాల రైతులు ఈ పంట సాగుకు మొగ్గు చూపారు. అయితే ఈ ఏడాది చైనాలో తేజా మిర్చి ఉత్పత్తి పెరిగింది. ఈ ప్రభావం ఇక్కడ మిర్చి ధరపై పడింది. ఇప్పుడు చైనా నుంచి ఆశించిన ఆర్డర్లు లేకపోవడంతో ఎగుమతిదారులు కొనుగోళ్లు తగ్గించడంతో పాటు కొనుగోలు చేసేవారు సైతం తక్కువ ధర పెడుతున్నారు. దీంతో ప్రస్తుతం మిర్చి ధర గరిష్టంగా రూ.14 వేలు ఉండగా, మోడల్ ధర రూ.13,500 ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో మిర్చి పండించిన ప్రాంతాల్లో అక్కడి వ్యాపారులు ఖమ్మం మార్కెట్ ఆధారంగా రూ.12వేల నుంచి రూ. 12,500 ధరతో కొనుగోలు చేస్తున్నారు.

ఖమ్మంలో కొంత ఎక్కువ ధరే వచ్చింది..



వరంగల్, మహబూబాబాద్ మార్కెట్లను దాటి ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చాం. గతేడాది ధర చూసి తేజా మిర్చిని సాగు చేశాం. వేములవాడలో వ్యాపారులు క్వింటా రూ.12 వేలకు అడిగారు. వరంగల్ మార్కెట్‌లో రూ.12,500 అన్నారు. ఖమ్మం మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందని 24 క్వింటాళ్లు తీసుకొచ్చా. రూ.13,500 చొప్పున కొనుగోలు చేశారు.

– ఉదుముల విష్ణన్ రెడ్డి, వేములవాడ, రాజన్న సిరిసిల్ల జిల్లా

క్వింటాకు రూ.1000 వరకు తేడా ఉంది..



రెండెకరాల్లో మిర్చి సాగు చేశా. మా ఊళ్లో క్వింటా రూ.12 వేలకు అడిగారు. ఖమ్మంలో ధర ఎక్కువ వస్తుందని తెలిసి 88 బస్తాలు తీసుకొచ్చా. రూ.13,500 ధర పలికింది. మా ఊరి ధరతో పోలిస్తే అన్ని ఖర్చులు పోగా క్వింటాకు రూ.1000కి పైగా తేడా వచ్చింది. ఇక్కడికి రావడంతో రూ.30 వేల వరకు కలిసొచ్చింది.

– రమావత్ రవి, పొట్టిగాని తండా, నల్లగొండ జిల్లా

సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారు..



సుదూర ప్రాంతాల రైతులు మిర్చి విక్రయానికి ఖమ్మం వస్తున్నారు. ఏపీ, తెలంగాణ రైతులు ప్రధానంగా తేజా రకం మిర్చిని ఈ మార్కెట్‌లో విక్రయించేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ధరపై ఆశతోనే రైతులు ఖమ్మం మార్కెట్‌ను ఎంచుకుంటున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం విక్రయాలు పెరిగాయి.

– పి ప్రవీణ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి

ప్రతీ నెల 12న హెచ్‌టీ వినియోగదారులతో సమావేశం

ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం: ప్రతీ నెల 12న హెచ్‌టీ వినియోగదారులతో సమావేశం నిర్వహిస్తామని ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. జిల్లాలోని గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు విద్యుత్ సమస్యలపై బుధవారం ఎస్ఈని కలిసి విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. పరిశ్రమలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ సమస్యలు ఎదురైతే నేరుగా తమను సంప్రదించవచ్చని చెప్పారు. క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమావేశంలో గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పాటిబండ్ల యుగంధర్, కార్యదర్శి కమర్తపు గోపాల్‌రావు, కోశాధికారి పరమేశ్వర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఖమ్మం రూరల్ డివిజన్ డీఈ నాగేశ్వరరావు, టెక్నికల్ డీఈ బాబూరావు, సీనియర్ ఎకౌంట్స్ అధికారి శ్రీధర్, ఏడీఈ నాగమల్లేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగుపై రైతులకు అవగాహన

వైరా కేవీకేలో కిసాన్ మేళా

వైరా: వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం కిసాన్ మేళా నిర్వహించారు. అధిక సాంద్రత పద్ధతిలో పత్తిసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న మాట్లాడుతూ సంప్రదాయ విధానంలో కంటే అధిక సాంద్రత పద్ధతిలో అధిక దిగుబడి సాధించవచ్చని చెప్పారు. వరి సాగు పద్ధతులపై మరో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకన్న వివరించారు. వరిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మేలైన వరి సాగుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అపరాల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె రుక్మిణీ దేవి మాట్లాడుతూ.. జిల్లాలో అపరాల సాగు పెరుగుదలకు కృషి చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖాధికారి మధుసూదన్, పశువైద్య శాఖ ఏడీఏ డాక్టర్ కె శ్రీరమణి, మధిర, వైరా ఏడీఏలు విజయచంద్ర, టి.కరుణశ్రీ, ప్రొఫెసర్ ఐ.వి. శ్రీనివాసరెడ్డి, కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, శాస్త్రవేత్తలు వి. చైతన్య, డాక్టర్ ఫణిశ్రీ, రైతులు రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకన్న, పక్కన అధికారులు


రామయ్యకు గోటి తలంబ్రాలు

దమ్మపేట: దమ్మపేట గ్రామానికి చెందిన మహిళలు 8 లక్షల 11 వేల గోటి తలంబ్రాలను రామయ్య కల్యాణానికి సిద్ధం చేశారు. శ్రీసీతారామ భక్త కమిటీ ఆధ్వర్యంలో మహిళలు చేతి గోళ్లతో ఒలిచి తలంబ్రాలను తయారు చేశారు. ముక్కోటి ఏకాదశి రోజు ఈ కార్యక్రమం ప్రారంభించి బుధవారం నాటికి పూర్తి చేశారు. వీటిని భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామివారి ఆలయంలో సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సీతారామ భక్త కమిటీ అధ్యక్షురాలు మురహరి గంగ, సభ్యులు సత్యవతి, సరస్వతి, అత్తులూరి కుమారి, కందుకూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా భద్రాచలం..

జూలూరుపాడు: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గోటి తలంబ్రాలను సమర్పించేందుకు బుధవారం పలువురు రామభక్తులు పాదయాత్రగా వెళ్లారు. ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో కొత్తూరు గ్రామ పంచాయతీ పెద్దహరిజనవాడ, జూలూరుపాడు, వెంగన్నపాలెం, అనంతారం, తదితర గ్రామాల రామభక్తులు నెల రోజులుగా గోటి తలంబ్రాలను ఒలిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రాచలంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగే శ్రీసీతారాముల కల్యాణమహోత్సవానికి గోటి తలంబ్రాలను సమర్పించేందుకు పాదయాత్రగా వెళ్లారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



అండర్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన కలెక్టర్ తదితరులు

- ప్రణాళిక ప్రకారం నగరాభివృద్ధికి చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి
- మురుగు నీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల శంకుస్థాపన

ఖమ్మంఅర్బన్: పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్‌లో అమృత్ –2లో భాగంగా రూ.249 కోట్లతో చేపడుతున్న మురుగు నీటి పైపులైన్, అండర్‌గ్రౌండ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖమ్మం నగరాభివృద్ధికి ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతున్నామని చెప్పారు. డ్రెయిన్ల నిర్మాణంలో పేదల స్థలాలు ఏమైనా కోల్పోయినా వారికి ప్రత్యామ్నాయం చూపించి పక్కాగా పనులు చేపట్టాలన్నారు. గతంలో వచ్చిన పరిస్థితి మరోసారి ఖమ్మం నగరానికి రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉంటే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ న్యాయపరంగా తొలగించాలని మంత్రి మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ క్రమంలో పేదలకు ఎక్కడైనా అన్యాయం జరిగితే ప్రభుత్వ పథకాల ద్వారా సాయం అందించాలని కలెక్టర్‌కు సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రపంచంలో వచ్చే మార్పులపై మనం కూడా దృష్టి పెట్టాలని, రెండేళ్ల క్రితం దేశంలో పట్టణీకరణ కారణంగా అర్బన్ జనాభా పెరిగిందని అన్నారు. ఖమ్మం నగరాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు తెలపాలన్నారు. ఢిల్లీ, ముంబై వంటి పెద్ద నగరాల్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ ఉందని, ఖమ్మం లాంటి చిన్న నగరానికి కూడా ఇది వచ్చిందంటే మంత్రి తుమ్మల కృషే కారణమని అన్నారు. సీపీ సునీల్ దత్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా ఉన్నట్టుగానే అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం కూడా నగరంలో రాబోతోందని, తద్వారా దేశంలో పెద్ద నగరాలతో పాటు ఖమ్మం నిలవనుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మేయర్ పునుకొల్లు నీరజ, ఆర్డీఓ నరసింహారావు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా, కార్పొరేటర్లు చావా మాధురి నారాయణరావు, సరిపూడి రమాసతీష్, లకావత్ సైదులు, నిరీషారెడ్డి, రావూరి కరుణసైదబాబు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పల్లెబోయిన చంద్రం, హుస్సేన్, మున్సిపల్ ఎస్ఈ రంజిత్, తహసీల్దార్ రవి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుతోనే గుర్తింపు

- విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు రాయాలి
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మంఅర్బన్: చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని, విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు బాగా రాయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. నగరంలోని పాండురంగాపురం పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం, వసతి, విద్యాబోధనను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతి పరీక్ష ఫలితాలు విద్యార్థుల భవిష్యత్‌కు తొలిమెట్టని అన్నారు. పలు అంశాలపై విద్యాబోధన చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాన్ని పరిశీలించారు. వారితో మమేకమై ఎలా చదువుతున్నారు? టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి గొప్ప లక్ష్యం ఉండాలని, దాన్ని సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ సౌకర్యాలు ఉన్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, అన్ని రకాల పుస్తకాలు, సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఆయన వెంట డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు ఉన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన డీఈఓ

ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలి

ఖమ్మంమయూరిసెంటర్ : వీధి వ్యాపారుల ప్రాంగణం ప్రజలకు సౌకర్యవంతంగా ఉండాలని, మౌలిక వసతుల కల్పనలో రాజీ పడకుండా చర్యలు చేపడతామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నగరంలోని పాత బస్టాండ్ ఎదురుగా గల వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. కూరగాయలు విక్రయించే షెడ్‌లు, స్టాళ్లు, తోపుడుబండ్లను పరిశీలించారు. కూరగాయల వ్యాపారులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. సరిపడా షెడ్లు లేవని, పట్టాలు కట్టి వ్యాపారం చేసుకుంటున్నామని కొందరు, విద్యుత్ స్విచ్ బోర్డులు ఏర్పాటు చేయాలని, వర్షాలు పడితే ప్రాంగణమంతా బురదమయం అవుతోందని మరి కొందరు చెప్పగా.. సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

చివరి దశకు ‘యాతాలకుంట’

- మిగిలిన టన్నెల్ పనులు 681 మీటర్లే..
- కాల్వల్లో ఇప్పటికే గోదావరి పరవళ్లు
- అధికారులతో నేడు మంత్రి తుమ్మల సమీక్ష

సత్తుపల్లి: యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులు ఎట్టకేలకు చివరి దశకు చేరుకుంటున్నాయి. 1,781 మీటర్ల పనులకు గాను 1,100 మీటర్ల మేర పూర్తయ్యాయి. ఇంకా 681 మీటర్ల పని మిగిలి ఉంది. భూ నిర్వాసితులకు రూ.15 కోట్లు చెల్లించడంతో రైతుల నుంచి అడ్డంకులు తొలిగిపోగా.. పనుల్లో వేగం పుంజుకుంది. రోజుకు నాలుగు షిఫ్టుల్లో 24 గంటలూ పనులు చేపడుతున్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా సత్తుపల్లి ట్రంక్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. బుగ్గపాడు వద్ద కాల్వల నిర్మాణ పనులకు కొంత ఆటంకం ఏర్పడినా ఇటీవలే రైతులకు పరిహారం చెల్లించడంతో ఆ సమస్య పరిష్కారం అయింది.

కమలాపురం పంప్‌హౌస్ నుంచి..

యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తయితే కమలాపురం పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలు దమ్మపేట మండలం మల్లెపూల వాగు మీదుగా బేతుపల్లి పెద్దచెరువుకు చేరుకుంటాయి. అక్కడి నుంచి బేతుపల్లి ప్రత్యామ్నాయ కాల్వ ద్వారా వేంసూరు, సత్తుపల్లి మండలాల్లోని పొలాలకు గోదావరి జలాలు చేరుకుంటాయి. అయితే సీతారామ ప్రాజెక్టు కింద రూ.29 కోట్లతో అంతర్గతంగా కాల్వల నిర్మాణానికి భూమి సేకరిస్తున్నారు. దీంతో చివరి పొలాలకు కూడా సాగునీరు అందించి సస్యశ్యామలం చేస్తారు.

రాజీవ్ లింక్ కెనాల్‌తో..

సత్తుపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా కాల్వలు డిజైన్ చేస్తున్నారు. ఇప్పటికే జూలూరుపాడు మండలం వినోభానగర్‌లోని రాజీవ్ లింక్ కెనాల్ నుంచి ఏన్కూరు వద్ద ఎన్నెస్పీ కెనాల్‌కు అనుసంధానం చేయగా తల్లాడ, పెనుబల్లి, కల్లూరు, వేంసూరు మండలాలకు గోదావరి జలాలు అందుతున్నాయి. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

టన్నెల్ నిర్మాణం భద్రమే..

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంతో యాతాలకుంట టన్నెల్ పనులపై అధికారులు పలుమార్లు సమీక్షలు చేసి నిర్మాణ పనులు భద్రమేనని నిర్ధారించుకున్నారు. 5.25 మీటర్ల వెడల్పు గల టన్నెల్ నిర్మిస్తున్నారు. టన్నెల్ తవ్వేప్పుడు వస్తున్న నీటిని ఆరు మోటార్లతో బయటకు తోడుతున్నారు. ప్రతీ మూడు నెలలకోసారి జియాలజిస్ట్ బృందం తనిఖీ చేసి సొరంగం లోపల భూమి పరీక్షలు నిర్వహించి సూచనలు చేస్తోంది.

నేడు మంత్రి సమీక్ష..

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి యాతాలకుంట టన్నెల్ పనులను గురువారం పరిశీలిస్తారు. ఆ తర్వాత అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఈ టన్నెల్ నిర్మాణం పూర్తయితే సత్తుపల్లి పట్టణానికి తాగునీరు, పరిసర ప్రాంతాల్లో సాగునీటి ఇబ్బందులు తీరే అవకాశం ఉంటుంది.



యాతాకుంట టన్నెల్ లోపల భాగం

క్లుప్తంగా

నాణ్యమైన సేవలు అందించాలి


మాట్లాడుతున్న డీఏఓ పుల్లయ్య

రఘునాథపాలెం: విత్తన, పురుగుమందుల డీలర్లు రైతులకు నాణ్యమైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ధనసరి పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం రఘునాథపాలెం మండలం వీవీపాలెం రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (దేశీ) శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, సుస్థిర వ్యవసాయాభివృద్ధి సాధించేలా డీలర్లు పనిచేయాలన్నారు. అనంతరం ఆత్మ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ అభిమన్యుడు, ఉద్యాన అధికారి సూర్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ అధికారి ఏడీఏ సతీశ్, రైతు శిక్షణ కార్యక్రమం వ్యవసాయ అధికారులు అరుణజ్యోతి, ఇంటూరి భాస్కర్‌రావు, శరత్, మండల వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలో ప్యానల్ అడ్వకేట్ల నియామకం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ప్యానల్ అడ్వకేట్లను నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. వీరు సింగరేణికి చెందిన కేసులను రీజియన్ పరిధిలో వాదించేందుకుగా యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలో వెల్లంకి వెంకటేశ్వరరావు, సత్తుపల్లి పరిధిలో రమేశ్‌కుమార్‌మక్కడ్, మణుగూరు పరిధిలో జీవీకే మనోహర్, ఇల్లెందు పరిధిలో ఎన్.మల్లికార్జున్‌ను యాజమాన్యం నియమించింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,871

‘హస్తం’లో మల్లగుల్లాలు!

సీతారామ ఎత్తిపోతల పథకం పేరు మార్పు యోచన?

- ఇందిరా/రాజీవ్ పేరు పెట్టాలని కాంగ్రెస్ ముఖ్యనేతల చర్చ
- వైఎస్ హయాంలో రాజీవ్, ఇందిరాసాగర్‌లు ప్రారంభం
- తెలంగాణ వచ్చాక సీతారామగా మార్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం


ములకలపల్లి మండలం వీకే రామవరంలో ఉన్న సీతారామ ప్రాజెక్ట్ రెండో పంప్‌హౌస్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు నాగార్జున సాగర్ ఆయకట్టుకు అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టారు. దుమ్ముగూడెం ఆనకట్ట ఆధారంగా రాజీవ్ సాగర్ ఉండగా, కొత్తగా వేలేరుపాడు మండలం రుద్రంకోట కేంద్రంగా ఇందిరాసాగర్ నిర్మించేలా డిజైన్ చేశారు. వీటికి సంబంధించి కొంతమేర పనులు చేపట్టాక రాష్ట్ర విభజన జరిగింది. దీంతో ఇందిరాసాగర్ ప్రాంతం పూర్తిగా ఏపీ పరిధిలోకి వెళ్లిపోయింది. తెలంగాణ ఏర్పడ్డాక ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్‌లను రద్దు చేస్తూ కొత్తగా సీతారామ బహుళార్థక సాధక ఎత్తిపోతల పథకానికి అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

తొమ్మిదేళ్లుగా...

సీతారామ ప్రాజెక్ట్ పనులు 2016లో మొదలైతే తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటివరకు పూర్తికాలేదు. 2023 డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఉన్నపళంగా గోదావరి జలాలను కృష్ణా ఆయకట్టుకు తరలించేందుకు రాజీవ్ సాగర్ లింక్ కెనాల్‌ను ప్రతిపాదించింది. ఏడాది కాలంలో ఈ కాలువ పనులు పూర్తి చేశారు. దీంతో తొలిసారిగా సాగర్ ఆయకట్టుకు ఈ నెల 5న గోదావరి జలాలను తరలించారు. మరోవైపు గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 8 వేల కోట్ల నుంచి రూ. 13 వేల కోట్లకు పెరిగింది. ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ అంచనా వ్యయాన్ని రూ.19 వేల కోట్లకు సవరించాల్సి వచ్చింది.

ఫాయిదా వచ్చేనా ?

ఉమ్మడి ఖమ్మం జిల్లా అనాదిగా భద్రాచల సీతారాముల పేరుతోనే ప్రసిద్ధి పొందింది. తానీషా కాలం నుంచి నేటి ముఖ్యమంత్రుల వరకు సీతారాముల కల్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. సీతారామ పేరు ఈ జిల్లాకు సెంటిమెంట్‌తో ముడిపడిన అంశంగా ఉంది. ఇప్పుడు ప్రాజెక్టు పేరులో మార్పులు చేస్తే ఫలితాలు ఎంత మేరకు సానుకూలంగా ఉంటాయనే అనుమానాలు కూడా అధికార పార్టీ నేతల నుంచే వినిపిస్తున్నాయి.

రాజీవ్ కెనాల్ తరహాలో

సీతారామ ప్రాజెక్టు స్వరూప స్వభావాల్లో ఎలాంటి మార్పులు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా లింక్ కెనాల్‌ను తెర మీదకు తెచ్చింది. దీనికి రాజీవ్ లింక్ కెనాల్ అని పేరు పెట్టగా, ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. పైగా కాంగ్రెస్ శ్రేణుల నుంచి హర్షాతిరేకాలు వచ్చాయి. ఇదే తరహాలో సీతారామ పేరు మార్చకుండా భవిష్యత్‌లో ఈ ప్రాజెక్ట్‌కు అనుబంధంగా చేపట్టబోయే ఇల్లెందు నియోజకవర్గ మాస్టర్ ప్లాన్‌కు రాజీవ్/ఇందిరా సాగర్‌ల పేరును పరిశీలిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదనే అభిప్రాయాలు ఇంజనీరింగ్ వర్గాల నుంచి వస్తున్నాయి. పైగా సీతారామకు సంబంధించిన తొలి శంకుస్థాపన సైతం ఇల్లెందు నియోజకర్గంలోనే జరిగింది. కానీ తర్వాత మార్పుల్లో ఈ నియోజకవర్గాన్ని సీతారామ లబ్ధిదారుల జాబితా నుంచి దాదాపుగా మినహాయించారు.

అనుబంధ పనులు

ప్రస్తుతం సీతారామలో ఎక్కడా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ లేదు. రోళ్లపాడు దగ్గర 10 టీఎంసీల సామర్థ్యంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించే అంశంపైనా ప్రస్తుత ప్రభుత్వం చర్చ చేసింది. దీంతోపాటు సీతారామ ద్వారా నీరు అందని భద్రాచలం, తక్కువ ప్రయోజనం పొందే పినపాక, కొత్తగూడెం నియోజకవర్గాల కోసం కొత్తగా ఎత్తిపోతలు చేపట్టే ప్రతిపాదనలు ఉన్నాయి. సీతారామకు అనుబంధంగా చేపట్టబోయే పనులు అనేకం ఉన్నందున, వాటికి కొత్తగా పేర్లు పెట్టడం ద్వారా స్వామికార్యం, స్వకార్యం రెండూ జరిగిపోతాయనే చర్చ హస్తం పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

పేరుపై చర్చ

కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాసాగర్, రాజీవ్‌సాగర్ పేర్లతో చేపట్టిన ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రద్దు చేసిందనే అభిప్రాయాన్ని ప్రస్తుత ప్రభుత్వంలో కీలకంగా ఉన్న కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. డీపీఆర్‌కు అనుమతులు సాధించడం మొదలు భారీ స్థాయిలో నిధులు సైతం తమ ప్రభుత్వ హయాంలో జరుగుతున్నందున, సీతారామ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌కు గతంలో ఉన్న ఇందిరాసాగర్ లేదా రాజీవ్‌సాగర్ పేరు పెట్టే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ఎలా ఉంటుందనే చర్చ ఇటీవల ముఖ్యనేతల మధ్య జరిగినట్టు సమాచారం.

జాతీయస్థాయి పోటీల్లో రజతం


వైశాలితో కోచ్ ఎండీ గౌస్

ఖమ్మంస్పోర్ట్స్: బిహార్ రాష్ట్రం పాట్నాలో జరుగుతున్న జాతీయస్థాయి యూత్ అథ్లెటిక్స్ పోటీల్లో ఖమ్మానికి చెందిన బి.వైశాలి రజత పతకం సాధించింది. హైప్టాథ్లిన్ ఈవెంట్‌లో పతకం సాధించిన ఆమెను డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్ ఎండీ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ సంఘం గౌరవ అధ్యక్షుడు నున్న రాధాకృష్ణ, అధ్యక్షులు మందుల వెంకటేశ్వర్లు, కార్యదర్శి షఫీక్ అహ్మద్, సభ్యులు కృష్ణయ్య, సుధాకర్, శశి, రవి, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, శ్రీనివాస్, హజీరా ఫాతిమా, ముజహిద్, నవీద్ తదితరులు అభినందించారు.

దేవాలయ వివాదంపై అధికారుల విచారణ


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం శ్రీ అంకమ్మ తల్లి దేవాలయం వివాదం ముదురుతోంది. కొంత కాలంగా దేవాలయాన్ని నిర్వాహకులు పట్టించుకోవటం లేదని, కనీసం దీప, ధూప, నైవేద్యం కూడా పెట్టటం లేదని గ్రామస్తులు దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా అంకమ్మతల్లి దేవాలయం విషయంలో వివాదం తలెత్తింది. జాతర సమయంలో తప్ప, మిగతా సమయంలో దేవాలయంలో కనీసం దీప, ధూప, నైవేద్యం కూడా పెట్టటం లేదని గ్రామస్తులు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఈ.వెంకటేశ్వర్లు, దేవాదాయ శాఖ ఈఓ పి.శ్రీకాంత్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలుసుకున్నారు. ఈ నెల 14 నుంచి జరిగే జాతర అనంతరం మరోమారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, గ్రామస్తుల అభిప్రాయాలు, ప్రస్తుత నిర్వాహకుల వివరణ తీసుకుని నిర్ణయం తీసుకుంటామని దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

గ్యాస్ లీక్ అయి వ్యాపించిన మంటలు

రూ.2 లక్షల ఆస్తి నష్టం


ప్రమాద వివరాలు తెలుపుతున్న బాధితులు

సత్తుపల్లిటౌన్: పిండి వంటలు చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ లీక్ అయి పైపు నుంచి మంటలు వ్యాపించిన ఘటన బుధవారం సత్తుపల్లిలో చోటుచేసుకుంది. పట్టణంలోని ద్వారకాపురి కాలనీకి చెందిన జెరిపిటి వెంకటేశ్వరరావు ఇంట్లో కుటుంబ సభ్యులు కలిసి ఇంటి వరండాలో పిండి వంటలు చేసేందుకు గ్యాస్ పొయ్యి వెలిగించారు. పైపు లీక్ కావటంతో మంటలు వ్యాపించడంతో మహిళలు దూరంగా వెళ్లిపోయారు. ఫైరింజన్‌కు సమాచారం అందించటంతో వీధిలో కొద్ది దూరం వరకు వచ్చి రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఆగిపోయింది. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు రూ.2 లక్షల విలువైన సామగ్రి దగ్ధమైనట్లు బాధితులు తెలిపారు.

ఏడు నామినేషన్లు దాఖలు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం ఏడు సభ్యులకు గాను మూడు రోజుల్లో ఏడుగురు నామినేన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి అవధానుల శ్రీనివాస్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీకి సంబంధించి బి.శ్రీధర్‌సింగ్, మహిళా విభాగానికి సంబంధించి జి.మృదుల, ఉబ్బన సరిత, జనరల్ కేటగిరికి సంబంధించి ఏలూరి శ్రీనివాసరావు, కోల రాంబాబు, జి.బాలకృష్ణ, ఎర్రా రమేశ్ నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. కాగా ఎన్నికల ఫలితాలు మాత్రం హైకోర్టు ఆదేశానుసారం వెల్లడిస్తామని చెప్పారు.

ఏకగ్రీవమయ్యే అవకాశం..

హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించి ఏడుగురు సభ్యులు ఉండగా ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా.. మొత్తంగా ఏడు నామినేషన్లు మాత్రమే దాఖలు కావటంతో ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది.

యువతి అదృశ్యం

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన యువతి కనిపించకుండా పోయినట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 8వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోవటంతో ఆమె తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి


పుల్లయ్య (ఫైల్)

కొణిజర్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని శాంతినగర్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ జి.సూరజ్, స్థానికుల కథనం ప్రకారం.. వైరా మున్సిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం దిద్దుపూడికి చెందిన అమర్లపూడి పుల్లయ్య (63) షుగర్ వ్యాధి పరీక్ష చేయించుకునేందుకు గాను తన ద్విచక్రవాహనంపై వైరా వెళ్తున్నాడు. దిద్దుపూడి అడ్డరోడ్డు వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూరజ్ తెలిపారు. పుల్లయ్య సీపీఐ కార్యకర్త కావడంతో ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, యర్రా బాబు, దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, పవన్, నాగభూషణం, లాజర్, గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు, దావీదు నివాళులర్పించారు.

నేటి నుంచి ఎద్దుల పోటీలు


ఒంగోలు జాతి ఎద్దులను చూపుతున్న కమిటీ సభ్యులు

వేంసూరు: మండలంలోని కందుకూరులోని శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం సందర్భంగా గొర్ల సత్యనారాయణరెడ్డి (బుల్లిబాబు) జ్ఞాపకార్థం గురువారం నుంచి మూడురోజులపాటు జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల నుంచి ఒంగోలు జాతి ఎద్దులు కందుకూరు చేరుకున్నాయి. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, 3వ బహుమతి రూ.30 వేలు, 4వ బహుమతి రూ.25 వేలు 5వ బహుమతి రూ.20 వేలు, 6వ బహుమతి రూ.15 వేలు, 7వ బహుమతి రూ.10 వేలు, 8వ బహుమతి రూ.7 వేలు అందించనున్నామని నిర్వాహకులు తెలిపారు.

లింక్ ఓపెన్... రూ.3.50 లక్షలు మాయం

కూసుమంచి: కూసుమంచికి చెందిన పుసులూరి ఉపేందర్ ఖాతా నుంచి తనకు తెలియకుండానే రూ.3.50 లక్షల నగదును సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఉపేందర్ సెల్‌కు పీఎం కిసాన్ పేరుతో ఓ లింక్ రాగా దాన్ని ఓపెన్ చేశాడు. దీంతో అతని ఖాతా నుంచి సోమవారం రూ.2 లక్షలు, మంగళవారం ఉదయం మరో రూ.1.50 లక్షలు మాయమయ్యాయి. ఉపేందర్ వరి కోత మిషన్‌లను లీజుకు తీసుకుని నడుపుతుండగా వాటికి అడ్వాన్స్ చెల్లించేందుకు ఫోన్‌పేను ఓపెన్ చేసి డబ్బులు పంపేందుకు యత్నించగా ఖాతాలో నగదు లేకపోవటాన్ని గుర్తించాడు. తాను మోసపోయానని గ్రహించి ఖమ్మంలోని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా వారు విచారణ చేపట్టారు. పీఎం కిసాన్ లింక్ ఓపెన్ చేయటం వలనే నగదును సైబర్ నేరగాళ్లు డ్రా చేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలిందని బాధితుడు తెలిపాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం


దగ్ధమవుతున్న దుకాణం

తిరుమలాయపాలెం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రికల్ షాప్ దగ్ధమైన ఘటన బుధవారం మండలంలోని కాకరవాయి గ్రామంలో చోటుచేసుకుంది. శ్రీరామ ఎలక్ట్రికల్ షాప్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. షాప్‌లోనే నివాసం ఉండటంతో సామగ్రి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. నష్టపోయిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని షాపు నిర్వాహకుడు రాము వేడుకుంటున్నాడు.